ఆదివారం 17-05-2026
నినాదం
నిఖార్సైన జర్నలిజం
సాహితీ లహరి
Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288,
Gmail: sahityalahari0@gmail.com, CELL : +91 6305584064

సాహిత్య రచనలకు ఆహ్వానం
ప్రతి ఆదివారం నినాదం పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.
sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064



# నేను... ఓ అస్తిత్వ కెరటాన్ని!

నాకు పదే పదే గుర్తొస్తున్నాయి
ఓ ఆర్య పెత్తనపు కుట్రలో
పుష్యమిత్రుడి ఖడ్గమై నా జాతిని చీల్చేసిన
ఆ బీభత్స దృశ్యాలు
అర్ధరాత్రి పెట్టిన అగ్నికీలల్లో
బౌద్ధ విహారాల దగ్ధ దృశ్యాలు
సజీవదహనం చేసిన జ్ఞాన సముదాయాల్లో
ఎంతటి జ్ఞానం కాలిపోయిందో
నా గుండెలో ఇప్పటికీ
అదే కమురు కమురుగా వాసన!

ఒకప్పుడు శాంతిని బోధించిన
బుద్ధుని అడుగుజాడల్లో
అహింసా రాజ్యపు వారసుడినై విలసిల్లాను.
ఒక్కసారిగా నా కాలం వెనక్కి మళ్ళింది
నమ్మిన సిద్ధాంతమే నాకు ఉరితాడుగా మారింది!
నా కళ్ల ముందే...
మౌర్య సామ్రాజ్యపు చివరి దీపం ఆరిపోయింది
బృహద్రదుడు నమ్మాడు
ప్రాణంకంటే ఎక్కవగా నమ్మాడు
పుష్యమిత్రుణ్ణి
సేనాధిపతిగా నియమించాడు
వాడు నక్కజిత్తులను ప్రదర్శించాడు
సొంత రాజునే వెన్నుపోటు పొడిచాడు
ఆ ఖడ్గం నుంచి రక్తం కాదు
ఒక కుతంత్రాల మనువాద వ్యవస్థ మళ్ళీ ముందుకొచ్చింది
అది నా అస్తిత్వాన్ని,
అది నా ఆర్థిక మూలాలను
దహించివేసే అగ్నిగుండం అవుతుందని
నేనప్పుడు ఊహించలేకపోయాను!

నా అక్షర జ్ఞానాన్ని, నా అస్తిత్వాన్ని
బూడిద చేసిన కుట్రలు
'భిక్షువు శిరస్సుకు వంద దీనారాలు'
అని వెలకట్టిన నాడే
నా మేధోసంపదను అడవుల పాలు చేశారు.
విజయోత్సవ ధర్మ స్తూపాలను కూల్చి,
ప్రశాంతమైన విహారాలను స్మశానాలుగా మార్చి
జ్ఞానోదయం కలిగిన చోటే వర్ణ విద్వేషాల్ని నాటారు.

ఎవరు అస్పృశ్యుడు?
బౌద్ధాన్ని వదలని నా మొండితనాన్ని చూసి
నన్ను గ్రామం వెలుపలికి నెట్టేసిన
నేను అస్పృశ్యుడినా?
నాగరికత అందరిదీ అనుకున్న వేళ
శ్రమను శూద్రుడికి,
సుఖాన్ని ద్విజుడికి పంచిన
ఆ మనుస్మృతి రాతల వెనుక ఉన్న
క్రూరత్వాన్ని
నేనిప్పటికీ బలవంతంగా అనుభవించేచేస్తున్నావు
వేల ఏళ్ల నా అణచివేతకు పునాది
ఆనాడు పుష్యమిత్రుడు విరిచిన ధర్మచక్రపు ముక్కలే!
నువ్వు శిలల్ని పగులగొట్టగలవేమో
కానీ సత్యాన్ని కాదు!
నువ్వు తలలను నరకగలవేమో
కానీ ఆలోచనలను కాదు!
నా నరనరాల్లో నేటికీ ప్రవహిస్తున్నది
బుద్ధుడు బోధించిన తత్వం
అశోకుడు పాలించిన సమతా సంస్కృతి!
ప్రతి పుష్యమిత్రుడికీ ఒక అంతం ఉంటుంది
మట్టిలో విత్తనమై మొలకెత్తే
మూలవాసికెప్పటికీ తిరుగుండదు!
నేను మళ్ళీ మేల్కొంటున్న అస్తిత్వ చైతన్యాన్ని!

ఒకప్పుడు
సమానత్వం గురించి మాట్లాడిన మార్గాలను
బలవంతంగా మూసేశావు
నన్ను వర్ణాలుగా, వృత్తులుగా, నైపుణ్యాలుగా
వర్గీకరించి నన్నే నాల్గుముక్కలు చేశావు
ప్రశ్నించే స్వరాలను రాజద్రోహంగా మార్చేశావు.
మనుస్మృతులు బలవంతపు గుదిబండలయ్యాయి
అవన్నీ నా మెడకు వేసిన సంకెళ్లయ్యాయి
నన్ను చదవకూడదన్నావు
నన్ను వినకూడదన్నావు
నన్ను దేవుడికి దగ్గర రాకూడదన్నావు
మూతికి ముంతకట్టావు
ముడ్డికి చీపురు కట్టావు
నన్నో అస్పృశ్యుడిగా చాటించావు
గెలిచిన వాళ్ళకు
ఓడిన వాళ్ళు బానిసలే!
గెలిచిన వాడిదే ధర్మమన్నావు
మా ఓటమిని దేవుడి తీర్పన్నావు.
అప్పుడే పుట్టింది
అస్పృశ్యత అనే నిశ్శబ్దపు శిక్ష.
పేదరికం అనే వారసత్వ కానుక
ఒకప్పుడు
నదులకు దారులు చూపిన నా తాత
బావి దగ్గర కూడా నిలబడకుండా చేశావు
ఒకప్పుడు
రాజ్యానికి ఆహారం పండించిన నా తండ్రికి
తన పిల్లల ఆకలిని కూడా తీర్చలేని
దుస్థితిని కలిగించావు

నాకు తెలుసు...
నేనెందుకు అస్పృశ్యుడిని అయ్యానో
నాకు తెలుసు
నేనెందుకు పేదవాడిని అయ్యానో
నాకు తెలుసు
నీ కర్మ సిద్ధాంతంలోని మర్మాలన్నీ!
నా జన్మ కర్మ కాదు...
గెలిచిన వాడు రాసిన కపట నాటకం!
అధర్మంపై ధర్మం గెలుపన్నావు
నీ దౌర్జన్యాన్ని 'ధర్మం' అని నమ్మించావు
నమ్మకపోతే శిక్షించావు
ఒక సామూహిక అస్తవ్యస్తస్థితిలో
నీ తీర్పులకు ప్రజలు చప్పట్లు కొట్టారు
కాదు, చప్పట్లుకొట్టేలా భయకంపితుల్ని చేశావు

ఏమైనా చేస్తావు
ఏదేదో చేశావు
మానవత్వాన్ని నిలువెత్తున పాతిపెట్టావు
అమానుషత్వాన్ని అభిషేకించుకున్నావు!

అప్పుడు నాకు అర్థమైంది
నువ్వు నా శ్రమను కాదు,
నా ఆత్మగౌరవానికే భయపడుతున్నావు.
అలా నన్ను ఊరి చివరకు నెట్టేశావు.
నా గుడిసెను ఊరికి దూరం చేసేశావు
మా గుడిసెల చుట్టూ
అవమానంతో గీసిన ఒక కనిపించని గీత.
ఆ గీత దాటితే శిక్ష.
నీళ్లు తాగితే శిక్ష.
అక్షరం నేర్చుకుంటే శిక్ష.
గాలి కూడా వేరే దారిలో రావాల్సి వచ్చింది.

నా నీడ
నీ వీధిలో పడితే పాపమైంది.
నీపొలాల్లో మాత్రం
నా చెమటకెలాంటి అపవిత్రత లేదు
నీ పంచపరమాన్నాలన్నీ
నా చెమటచిందించిన సుగంధాలే!
విత్తనం నేలని పండించి
చివరకు మట్టికే
పరాయిదైపోయిన కథను వినాల్సి వచ్చింది.
నాపాటలను జానపదమన్నావు.
నీ మాటలను వేదమన్నావు.
ఏమైనా అంటావు
శారీరకంగా శ్రమించలేని
కొంతమందిస్థానికుల్నీ
వల్లో వేసుకున్న మాయల మంత్రానివికదా!
అర్థంకాని వ్యామోహంలో పడేయగల
వాక్చాతుర్యం నీది!

బ్రతకాలి
బ్రతకడం కోసం
భవిష్యత్తుని బ్రతికించడం కోసం
సత్యాన్ని మళ్ళీ
విజయదండోరా పలికించడం కోసం
బ్రతకాలి!
తప్పలేదు



నేను చనిపోయిన పశువులు మోశాను.
నీ మురికిని శుభ్రం చేశాను.
చనిపోయిన నీ శవాల్ని దహనం చేశాను.
ఇది యాదృచ్ఛికం కాదు.
ఓడిపోయిన వాడిపై
గెలిచిన వాడు తీర్చుకున్న
శతాబ్దాల కక్షల సామూహిక స్వప్నం!
నీ కల నెరవేరింది
భూమి కోల్పోయిన రోజే
నేను నా సర్వస్వాన్నీ కోల్పోయాను.
అక్షరం కోల్పోయిన రోజే
నేను నా చరిత్రనంతా దహనం చేశావు
ఆత్మగౌరవం కోల్పోయిన రోజు
నన్ను నేనే సర్వం కోల్పోయాను.

పేదరికం నా ఇంటిపేరైంది.
అస్పృశ్యత నా నీడైంది.
నా పిల్లలు
అవమానాల్నీ, ఆకల్నీ వారసత్వంగా పొందారు.
చరిత్ర ఎంత లోతుగా పాతిపెట్టినా
మట్టిలో ఏదొక విత్తనం లేవకపోదు
ఒక రోజు
నా పిల్లలు ప్రశ్నించడం మొదలుపెడతారు.

"మా చేతులే ఈ దేశాన్ని మోస్తుంటే
మా కడుపులు మాత్రమే
ఎందుకు ఖాళీగా ఉంటున్నాయి?"

"మా చెమటతో దేవాలయాలు నిర్మిస్తుంటే
మేము మాత్రమే ఆ గడపనెందుకు
దాటలేకపోతున్నాం?"

ఆ ప్రశ్నలే
మెల మెల్లగా అగ్నిపర్వతాలవుతాయి.
మహోగ్రజ్వాలలై నిన్ను భస్మీపటలం చేస్తాయి!
పూలే స్వరంలో
నేను నా అవమాన చరిత్రను విన్నాను.
అంబేద్కర్ అక్షరాల్లో
కోల్పోయిన నా మనిషితనాన్ని చూసుకున్నాను.
నేను పాపం కాదు...నేను పాపినీ కాదు!
నేను ఓటమిని కాదు.
నీ కుట్రలకు బలైపోయిన నిజాయితీని!
నీ కుతంత్రాలకు బందీనైపోయిన
ప్రేమ స్వరూపాన్ని!

వాయువ్య దిశ నుంచి వీచిన ఆర్య గాలులు
పశ్చిమ గంగా మైదానాన్ని తాకిన వేళ...
నా స్వేచ్ఛా గిరిజన విభాగాలు, నా జనపదాలు
వర్ణ విభజన అనే ఇనుప కంచెల్లో బందీ అయ్యాయి.
వ్యవసాయం నేర్పిన నా చేతులకు
'అపవిత్రత' అనే ముద్ర వేశావు
నా వృత్తిని, నా ఉనికిని బహిష్కరించి
నన్ను నా నేలకే పరాయివాడిని చేశావు!
మధ్యలో ఒక మెరుపు మెరిసింది
అశోకుని కళింగ యుద్ధపు రక్తపాతం
కరుణగా మారి, బౌద్ధమై ప్రవహించింది.
నాటి అశోకుని ధర్మచక్రం కింద
నేను మనిషిగా శ్వాసించాను
అస్పృశ్యత లేని, అహింస రాజ్యపు వారసుడినయ్యాను.
బౌద్ధ విహారాలు నా జ్ఞానానికి ఆలయాలయ్యాయి
సమానత్వం నా దైనందిన జీవనమైంది.
అశోకుడు వెళ్ళిపోయాడు
వెలుగు వెనుక చీకటి పొంచి ఉన్నట్టే
చివరి మౌర్య పాలకుడు బృహద్రథుడి వెనుక
పుష్యమిత్రుడి రూపంలో కుతంత్రం కత్తి నూరింది.
సొంత రాజును చంపి, బౌద్ధాన్ని దహించి
బలవంతపు వర్ణ వ్యవస్థను మళ్ళీ రుద్దిన ఆ నాడు...
నా స్వేచ్ఛ మళ్ళీ బానిసత్వమయ్యింది

నా సమత మళ్ళీ అస్పృశ్యతయ్యింది!
ఆనాడు పుష్యమిత్రుడు స్థాపించిన
శుంగ సామ్రాజ్యం
కేవలం ఒక రాజ్యం కాదు...
అది తరతరాల నా పేదరికానికి నాంది
అది నా మెడపై ఇనుప సంకెళ్ళు వేసిన
మనువాదపు అడుగుజాడ.
చరిత్ర సాక్షిగా చెబుతున్నాను
నేను అనుభవిస్తున్న ఈ బహిష్కరణ
అనాదిగా వస్తున్న కుట్రల పరంపర!
కానీ... వినండి!
చరిత్ర నిరంతరం ఒకేలా ఉండదు
నాడు అణచివేతకు గురైన దేశీయ శక్తిని నేను
నేడు చైతన్యమై మేల్కొంటున్న ద్రావిడ స్ఫూర్తిని నేను.
ఆర్య వర్ణ వ్యవస్థ పునాదులను కదిలించే
అక్షర యుద్ధాన్ని నేను!
నా మూలాల్లోకి వెళ్ళి
ఆ సత్యాన్ని మళ్ళీ ఆవిష్కరిస్తాను!

మళ్ళీ నా అస్తిత్వంలోకి
నా జాతినంతటినీ తీసుకెళతాను
నేను కెరటాన్ని
నాకు పడిపోవడం తెలుసు
నాకు మళ్ళీ లేవడమూ తెలుసు
ఈసారి ఆప లేనంతటి మహా ప్రవాహాన్నవుతాను!

నేను శతాబ్దాలుగా అణచివేయబడిన
ఈ దేశపు అసలు శ్రమజీవి చరిత్రను
మళ్ళీ నా చరిత్రను
నేను మళ్ళీ మళ్ళీ తవ్వుకోగల శ్రామికుణ్ణి!
ఇప్పుడిక నేను నా పిల్లలకు భయం కాదు
ప్రశ్నించడమే నేర్పుతున్నాను.
ఇప్పుడిక నేను నా వారసులకు చరిత్రను
చదువుకోవడమేకాదు,
పునర్మించడం నేర్పుతున్నాను.
ఒకసారి బానిస తన సంకెళ్లను గుర్తుపట్టాక
ఆ సంకెళ్లింక ఎంతకాలమో నిలబడవులే!
నేను...మళ్ళీ కెరటమై లేవడమెలాగో
నేర్పుతున్న అస్తిత్వ కెరటాన్ని!
ఎన్ని సార్లు పడినా
మళ్ళీ మళ్ళీ లేవడమెలాగో తెలిసిన చైతన్యాన్ని!

నేను... ఇప్పుడు కేవలం ఒక వ్యక్తినో, వర్గానో కాదు
వేల ఏళ్ల గాయాలను మోస్తున్న
ఒక చారిత్రక సత్యాన్ని!
పుష్యమిత్రుడి ఖడ్గానికి విరిగిపోని మేధో సంపత్తిని
మనువాదపు సంకెళ్లకు లొంగని ఆత్మగౌరవ శిఖరాన్ని.
నా అక్షరం... ఇప్పుడు కేవలం ఒక సిరా చుక్క కాదు
అది కోట్లాది మంది గుండెల్లో రగులుతున్న విప్లవ జ్వాల!
నా పాట... ఇప్పుడు కేవలం ఒక జానపదం కాదు
అది ఈ దేశపు మూలవాసుల రాజ్యాధికార నినాదం.!

- డా.దార్ల వెంకటేశ్వరరావు
ప్రొఫెసర్, తెలుగు శాఖ,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,
హైదరాబాద్,
ఫోన్: 9989628049



ఆదివారం 17-05-2026

నినాదం
నిఖార్సైన జర్నలిజం

# సాహితీ లహరి

Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288,
Gmail: sahityalahari0@gmail.com, CELL : +91 6305584064

## సాహిత్య రచనలకు ఆహ్వానం

ప్రతి ఆదివారం *నినాదం* పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064


# యువ భారత స్వాప్నిక కవి

**" ఆత్మ పరమాత్మ లేవు జగమున సారమున్న మట్టి తప్పు"**

సమాజం మారాలని కోరుకునే కవులు, సమాజాన్ని మారుస్తాం అనే కవులు మొట్టమొదట బయట పడవలసింది 'భావవాదం' నుండి అలవడవలసింది 'భౌతికవాదం'. భౌతిక వాదులు కాని కవులు ఎంతగా మార్పును గురించి మాట్లాడినా అదంతా ప్రగల్భమే అవుతుంది. సంప్రదాయ కవికీ, ఆధునిక కవికీ ఉండే తేడా ఈ భావ,భౌతిక భావజాలం దగ్గరే. "కొంతమంది యువకులు ముందుతరం దూతలు" అంటే భౌతికవాదులనే అర్థం. శ్రీనివాస్ 'తత్వాలు', 'నేనైతే నాస్తికుడినే' కవితలలో నిర్ద్వంద్వంగా తన భౌతిక భావజాలం ప్రకటన చేశారు. ఒకవేళ దేవుడంటూ ఉంటే అన్నం పెట్టేవాడు,చదువు చెప్పేవాడు, ఉపాధి చూపేవాడు, జన్మనిచ్చే వాళ్ళు అని వివరణ కూడా ఇచ్చుకున్నారు. ఎవడికీ ఏపనీ చేయకుండా నిరంతరం పూజలూ, ప్రార్థనలూ చేసుకునే వాళ్ళు కాకుండా మనకు ఒక మంచి జీవితాన్ని ఇచ్చేవాళ్ళకు దేవుళ్ళస్థానం ఇచ్చి, దైవ భావనను మానవీకరించారు శ్రీనివాస్.

"యువభారతం" శ్రీనివాస్ మొదటి కావ్యం. 'ఆచార్య సి. నారాయణరెడ్డి' గారు ఒక సభలో ప్రసంగిస్తూ, "శీబ్ప్రు' (యూత్ )లో మొదటి అక్షరం", అది కేవలం ఒక అక్షరం మాత్రమే కాదు. అది ఔష్ట్రం అని ప్రశ్నించేది అని చెప్పారు. ఆయన దృష్టిలో "యువత అంటే గొర్రె దాటు బాపతు కాదు, ప్రశ్నించి నిగ్గుతేల్చే వారే యూత్" అని. శ్రీనివాస్ యువభారతం కావ్యంలో భారతదేశ ఆర్థిక, సాంఘిక, రాజకీయ, తాత్వికతలను అనేక రకాలుగా ప్రశ్నించారు. సాంఘిక వివక్షను, ఆర్థిక అసమానతలను, రాజకీయ నిరంకుశత్వాన్ని, అవినీతిని, తాత్విక మౌఢ్యాన్ని ఆయన ప్రశ్నించారు. ఆయనకు ఒక సామాజిక స్వప్నం ఉంది. సామాజికంలో ఎవరి ఆత్మగౌరవమూ దెబ్బతినకూడదు. శ్రామికులైన దళిత బహుజనులు, రైతులకు న్యాయం జరగాలి. అధిక సంఖ్యాకులైన దళిత బహుజనులదే రాజ్యం కావాలి. అల్ప సంఖ్యాకుల చేతిలో రాజ్యాధికారం ఉండడం అన్యాయమే. రైతు శ్రమకూ ఫలితం దక్కాలి. నగరీకరణ అభివృద్ధి చెందినా దళితులకు ఆశ్రయం దొరకని అమానుషత్వం నశించాలి. మనువాద ప్రాబల్యం నుంచి భారతదేశం బయటపడి, అంబేద్కరీయ భారతంగా రూపొందాలి. ఇదీ ఆయన ఆకాంక్షించే భారతం.

దేశమంటే మనుషులోయ్ అన్నారు గురజాడ. శ్రీనివాస్ అంబేద్కరీయ మార్గంలో దేశమంటే ప్రజాస్వామ్యం, దేశమంటే ప్రజాధికారం వంటి అనేకరకాలుగా నిర్వచించారు. ఇవాళ మతభక్తి దేశభక్తిగా చెలామణి కావడాన్ని శ్రీనివాస్ తిరస్కరించారు.మంత్రవాదులే దేశభక్తులైతే, జెండా మోసినవాడు, జెండా కట్టినవాడు ఏమవుతాడు అని ప్రశ్నించారు శ్రీనివాస్. ఇలాంటి ప్రశ్నలు చాలా ఉన్నాయి ఈ కావ్యంలో.




శ్రీనివాస్ తాత్వికంగా దళిత బహుజనవాది."శ్రమజీవుల చెమటతోనే ఈ దేశం ముందుకు సాగుతుంది" అనే సిద్ధాంతం శ్రీనివాస్ ది. ఆ శ్రమజీవులు దళిత బహుజనులేనని కూడా ఆయన పేర్కొన్నారు. "బహుజనులమే కదా..!" కవిత ఆయన బహుజన వాదాన్ని బలంగా వినిపిస్తోంది. దళితులు మీద జరుగుతున్న నరమేధం పట్ల శ్రీనివాస్ తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. దళిత బహుజనులను కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడమని పిలుపునిచ్చారు.
"కులాల పేరుతో,మతాల పేరుతో, /ప్రేమలపేరుతో,
కులాల గోడలు కడుతూ,/ మతాలు మంటలు పెట్టే బైరాగుల/ కూకటి వేళ్ళతో పెకలించేందుకు కులగజ్జి జిడ్డును తొలగించేందుకు / ఓ బహుజనుడా !లేచి గర్జించు" అని గర్జించారు.


"ఈదేశం కలుషితం అయింది" కవితలో శ్రీనివాస్ రాజకీయ స్వరం బలంగా వినిపిస్తుంది. యువత మన రాజకీయ వ్యవస్థనుండి ఏమాశిస్తున్నదో ఆయన స్పష్టంగా చెప్పారు. విషాదం ఏమిటంటే మన పాలకులు ప్రజల ఓట్లతోతప్ప, వాళ్ళ జీవితాలతో తమకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరించడం.

శ్రీనివాస్ లో ఒక తెలంగాణ వాది కూడా ఉన్నాడు. " మన తెలంగాణా", "నాదేశం నన్నుబానిసగానే బతకమంటున్నది" వంటి కవితలు ఆయనలోని తెలంగాణ అస్తిత్వ చైతన్యాన్ని చాటుతున్నాయి." మన తెలంగాణా" కవితలో తెలంగాణ చరిత్ర సంస్కృతులను ఒక పెద్ద కవితలో కుప్ప పోశారు. మరో కవితలో అక్కడి జీవితం పరాయీకరణం చెందడాన్ని వేదనగా చిత్రించారు. యువభారతం కవితలో శ్రీనివాస్ యువతకు చైతన్య ప్రబోధం చేస్తు పదండి ముందుకు అని పిలుపునిచ్చారు.
"కులం కాదోయ్ గుణం గొప్పది
మతం కాదోయ్ మనసు గొప్పది"

"యువ భారతం" కవితలో శ్రీనివాస్ ను వేమన, గురజాడ పూనినట్లున్నారు. ఆయన నేటి యువతకు చెప్పాలనుకున్నదంతా ఆకవితలో చెప్పారు.

యువకవి శ్రీనివాస్ తెలంగాణ పల్లె నుండి హైదరాబాద్ నగరం వచ్చినా, ఆయనలో పల్లె ప్రీతి నశించలేదు. పల్లె ప్రీతి అంటే ప్రకృతి ప్రీతి. "అడవులు","తొలకరి జల్లు"," "పాకాల నీకేల తలపోత","ఏరువాక" వంటి కవితలలో ఆయన ప్రకృతి ప్రేమ తెలుస్తుంది. ప్రకృతి విధ్వంసమైపోవడం పట్ల ఆవేదన చెందారు. వాన పడడంచూసి పరవశించి పోయారు. పాకాల చెరువు ఔన్నత్యాన్ని చాటిచెప్పారు. అంటే శ్రీనివాస్ లో ఇంకా తడి ఆరిపోలేదని అర్థం. హైదరాబాద్ నగరం జీవితంలోని వైవిధ్యాన్నీ, వైరుధ్యాలను కవి జాగ్రత్తగా కవిత్వీకరించారు.


తెలుగు భాషంటే శ్రీనివాస్ కు ఎనలేని ప్రేమ, మక్కువ. "బతుకు నేర్పిన భాష","నా కవితల కంపెనీలు" వంటి కవితలు ఆయన తెలుగు భాషాభిమానాన్ని చాటుతున్నాయి.తెలుగు భాష కేవలం ఒక భాష మాత్రమేకాదు, అది మన గుండెచప్పుడు అని వర్ణించారు. అంబేద్కరీయులైన కవులు ఆయనమీద కవిత రాయకపోవడం సాధ్యంకాదు. భారత రాజ్యాంగ నిర్మాతగా ఆయనను గౌరవించారు శ్రీనివాస్. ఆయనను విశ్వనరుడు అని కీర్తించారు. ఆయన ఇచ్చిన హక్కులను రుక్కులుగా చదువుదాం అని తన్మయత్వంతో చెప్పారు. శ్రీనివాస్ ఈ కావ్యంలో స్త్రీలను గురించి కూడా కవితలు రాశారు. కవిత్వభాష విషయంలో శ్రీనివాస్ ఇంకా పరిపక్వత చెందవలసి ఉంది. "సాధనమున పనులు సమకూరు ధరలోన" అన్నారు వేమన. గ్రాంథిక, వ్యావహారిక, గేయ, వచనకవితా భాషల సంగమంగా ఉంది ఈ కావ్యం. భవిష్యత్తులో శ్రీనివాస్ ఈ మిశ్రమంలో నుండి బయటపడి మరింత మంచి కవితలు రాయాలని ఆకాంక్షిస్తున్నాను. శ్రీనావాస్ కు శుభాకాంక్షలు.



ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి
రచయిత, విమర్శకులు
శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

## నా మేనకోడలు

### దేవుడిచ్చిన ఓ మహత్తర కానుక!



మా మేనకోడలు...
ఇంట్లో తిరిగే చిన్న నవ్వు కాదు,
అలసిపోయిన రోజుల మీద
వానచినుకులా పడే ఓ ఆత్మీయ స్పర్శ.
ఆమె చేతి తాకిడి
ఎండలో ఎండిపోయిన చెట్టుకు
తొలి చిగురొచ్చినంత ఉపశమనం.
ఆమె నవ్వు
గూటి దారి మరిచిపోయిన పక్షికి
మళ్లీ ఆకాశం గుర్తొచ్చినట్టుంది.
నేను మౌనంగా కూర్చుంటే
ఆమె మాటలు
పొద్దుపొడిచే ముందు
తూర్పు అంచున వెలిసే
వెలుగులా నన్ను తాకుతాయి.
ఆ చిన్న వేళ్లు
నా చేతిని పట్టుకున్నప్పుడు
కాలం కూడా కాసేపు
తన పరుగును ఆపి చూస్తుంది.
ఆమె ప్రేమలో
లెక్కలు ఉండవు...
చెరువులోకి దిగిన చంద్రబింబంలా
నిశ్శబ్దంగా హృదయమంతా పరుచుకుంటుంది.
కొన్ని బంధాలు
రక్తంతో మాత్రమే కాదు,
మనసు మీద పడిన
మృదువైన వర్షపు చినుకులతో నిలుస్తాయని
ఆమెనే నేర్పింది.
మా మేనకోడలు...
ఈ పరుగుల ప్రపంచంలో
ఇంకా మనుషుల్లో వెచ్చదనం మిగిలే ఉందని
నమ్మించే చిన్న దీపం.
ఈ మేనకోడలు
నాకు దేవుడిచ్చిన ఓ మహత్తర కానుక!

- డి.సాయినాథ్ రెడ్డి.

# భాగ్యరెడ్డి వర్మ 'వెట్టిమాదిగ' కథ

# సామాజిక వాస్తవికత

తెలంగాణ కథా సాహిత్యంలో సామాజిక అణచివేతపై ఎక్కుపెట్టిన తొలి బాణం భాగ్యరెడ్డి వర్మ రాసిన 'వెట్టిమాదిగ' కథ. అయితే దీన్ని భాగ్యరెడ్డి వర్మ 1931లో 'అజ్ఞాతవాసి' అనే కలం పేరుతో రచించారు. . 20వ శతాబ్దం ఆరంభంలో నిజాం కాలపు భూస్వామ్య వ్యవస్థలో వేళ్లూనుకున్న అమానవీయ 'వెట్టి చాకిరి'ని, కుల వివక్షను ఈ కథ అత్యంత శక్తివంతంగా ప్రతిబింబిస్తుంది. అట్టడుగు వర్గాలకు చెందిన ప్రజలు తమ కనీస మానవ హక్కులను, ఆత్మగౌరవాన్ని కోల్పోయి, దొరల గడీల కింద బానిసలుగా ఎలా నలిగిపోయారో రచయిత ఇందులో వాస్తవిక దృక్పథంతో చిత్రించారు.

భాగ్యరెడ్డి వర్మ (1888-1939) హైదరాబాదు సంస్థానంలో అణగారిన వర్గాల చైతన్యానికి, విద్యాభివృద్ధికి పునాది వేసిన అసాధారణ సంఘ సంస్కర్త. భాగ్యరెడ్డి వర్మ దృక్పథం పూర్తిగా అస్తిత్వ చైతన్యం, సమానత్వం, సంస్కరణావాదంపై ఆధారపడి ఉంది. దళితులే ఈ దేశపు మూలవాసులని, వారి పూర్వీకులు పాలకులనే (రేడు/రెడ్డి) సత్యాన్ని బలంగా నమ్మిన ఆయన, తన పేరు చివర 'రెడ్డి'ని చేర్చుకుని ఆత్మగౌరవ ప్రకటన చేశారు. వైదిక వర్ణ వ్యవస్థను, అస్పృశ్యతను తీవ్రంగా వ్యతిరేకించిన ఆయన, ఆర్య సమాజం, బ్రహ్మ సమాజాలలో కూడా దళితులకు సమాన గౌరవం దక్కకపోవడాన్ని గమనించి, చివరకు బుద్ధుడు ప్రవచించిన స్వేచ్ఛ, సమానత్వం వైపు మొగ్గుచూపి బౌద్ధ ధర్మాన్ని స్వీకరించారు. సాహిత్యం, హరికథలు, పత్రికల ద్వారా సామాన్య ప్రజల్లో చైతన్యం తేవాలని ఆశించిన ఆయన, తన 'భాగ్యనగర్' పత్రికలో 'వెట్టి మాదిగ' వంటి రచనల ద్వారా నాటి సామాజిక అన్యాయాలను ధైర్యంగా ఎండగట్టారు. కుల వివక్షను అంతం చేయడానికి విద్య, అజ్ఞాన నిర్మూలనే ఏకైక మార్గాలని ఆయన గట్టిగా విశ్వసించారు.

ఆధారం 1920ల నాటి నిజాం ప్రభుత్వ రికార్డులు మరియు నాటి 'ఆంధ్ర మహాసభ' తీర్మానాలు. నిజాం రాజ్యంలో భూమి అధికంగా జగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, పటేల్-పట్వారీలకు ఆధీనంలో ఉండేది. ఈ భూస్వాములు గ్రామాల్లోని అట్టడుగు వర్గాల వారితో, ముఖ్యంగా మాదిగ, మంగలి, చాకలి, కుమ్మరి కులాల వారితో ఎటువంటి వేతనం ఇవ్వకుండా తమ వ్యక్తిగత పనులను, ప్రభుత్వ పనులను చేయించుకునేవారు. మాదిగలు పటేళ్ల ఉత్తరాలు మోయడం (వంతు వెట్టి), చెప్పులు కుట్టడం వంటివి ఉచితంగా చేయాల్సి వచ్చేది. దీనిపై 1921లో నిజాం ప్రభుత్వం వెట్టిని నిషేధిస్తూ ఒక ఫర్మానా (జీవో) జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో భూస్వాముల పెత్తనం వల్ల అది అమలుకు నోచుకోలేదు.

భాగ్యరెడ్డి వర్మ రాసిన 'వెట్టి మాదిగ' కథ తెలంగాణ కథా సాహిత్యంలో సామాజిక వాస్తవికతకు ఒక నిలువుటద్దం.ఈ కథలో పటేల్ రామిరెడ్డి పాత్ర నాటి భూస్వామ్య వ్యవస్థకు ప్రతిరూపం. గ్రామాల్లో పటేల్-పట్వారీలు కేవలం ప్రభుత్వ ప్రతినిధులుగా కాక, సర్వాధికారాలు కలిగిన నియంతలుగా ఉండేవారు. మల్లడు తన సొంత వ్యవసాయ పనిలో ఉండి వెట్టికి రాలేనని చెప్పినప్పుడు, రామిరెడ్డి అతడిని పశువును బాదినట్టు బాదడం ఆనాటి పెత్తందారీ పోకడలకు నిదర్శనం. చట్టం, న్యాయం కేవలం ఉన్నత వర్గాల చేతుల్లోనే ఉండేవని, సామాన్యుడి ప్రాణానికి కనీస విలువ లేదని ఈ కథ స్పష్టం చేస్తోంది. వెట్టి అనేది కేవలం ఆర్థిక దోపిడీ మాత్రమే కాదు, అది కులంతో ముడిపడి ఉన్న అమానవీయ ఆచారం. మాదిగ కులానికి చెందిన మల్లడు తన జీవనాధారమైన పనులను వదులుకుని, పటేల్ యొక్క వ్యక్తిగత ఉత్తరాలను మోయడానికి ('వంతు వెట్టి') సిద్ధంగా ఉండాలనే నిబంధన నాటి సామాజిక వివక్షను సూచిస్తుంది. అట్టడుగు రూపం. తన జీవనాధారమైన పొలం పనిని కాపాడుకోవాలనే తపన, దొర అధికారం ముందు మోకరిల్లక తప్పని దీన స్థితి అతడి పాత్రలో కనిపిస్తాయి. దీనికి భిన్నంగా, గ్రామ పోలీస్ పటేల్ రామిరెడ్డి పాత్ర నాటి భూస్వామ్య అహంకారానికి, క్రూరత్వానికి ప్రతీకగా నిలుస్తుంది; తన మాటకు ఎదురుచెప్పిన నిరుపేదను పశువుకంటే హీనంగా బాదడం, రక్తం ఓడుతున్నా జాలి పడకపోగా తిరిగి అతడి భూమిని జప్తు చేస్తానని బెదిరించడం ద్వారా పటేల్ పాత్రలోని నిరంకుశత్వం వాస్తవికంగా ఆవిష్కృతమైంది. అలాగే, దొర ఆజ్ఞలను జరిపే నిమిత్తం మల్లడిని బలవంతంగా ఈడ్చుకొచ్చే తలారి పాత్ర, వ్యవస్థాగతమైన అణచివేతలో భాగంగా కిందిస్థాయి సిబ్బంది ఎలా కఠినంగా ప్రవర్తించేవారో సూచిస్తుంది. ఈ విధంగా, రచయిత ఎక్కడా కృత్రిమత్వం లేకుండా, నాటి సామాజిక వాస్తవికతకు అద్దం పట్టేలా పాత్రలను అత్యంత సజీవంగా పోషించారు. మొత్తానికి, 'వెట్టి మాదిగ' కథ కేవలం ఒక కల్పిత గాథ కాదు; అది 20వ శతాబ్దం ఆరంభంలో తెలంగాణ దళిత జీవితాలలోని రక్తాన్ని, కన్నీటిని అక్షరీకరించిన ఒక చారిత్రక వాస్తవం. సాహిత్యం అనేది సామాజిక సంస్కరణకు ఆయుధమని నమ్మిన భాగ్యరెడ్డి వర్మ, ఈ కథ ద్వారా వెట్టి చాకిరి వెనుక ఉన్న సామాజిక క్యాన్సర్‌ను అత్యంత ధైర్యంగా ఎండగట్టారు.

**ఇతర కథల తులనాత్మక పరిశీలన :**

భాగ్యరెడ్డి వర్మ 'వెట్టి మాదిగ' కథను నాటి తెలంగాణ తొలితరం కథలతో తులనాత్మకంగా పరిశీలిస్తే, వస్తు ఎంపికలోనూ, సామాజిక దృక్పథంలోనూ ఇదొక విప్లవాత్మకమైన ముందడుగుగా కనిపిస్తుంది.

గ్రామ పోలీసు పటేల్ రామిరెడ్డి తన బంధువులకు ఒక ఉత్తరం పంపించాల్సి ఉంటుంది. ఆ ఉత్తరాన్ని తీసుకువెళ్లడానికి (దీనినే 'వంతు వెట్టి' అంటారు) వెట్టి పని చేసే మల్లడు అనే వ్యక్తిని తీసుకురావలసిందిగా తలారిని పంపుతాడు. ఆ సమయంలో మల్లడు తన పొలంలో ధాన్యపు కుప్పల పనిలో నిమగ్నమై ఉంటాడు. అది తన జీవనాధారమైన పని కావడంతో, "పని ముగించుకుని కొంచెం ఆలస్యంగా వస్తాను" అని మల్లడు తలారితో చెబుతాడు. మల్లడు వెంటనే రాలేదని తెలియగానే పటేల్ ఆగ్రహంతో ఊగిపోతాడు. తలారి మల్లడిని బలవంతంగా ఈడ్చుకుంటూ పటేల్ ముందుకు తెస్తాడు. తన మాటకు ఎదురు చెప్పాడనే నెపంతో, పటేల్ మల్లడిని పశువును బాదినట్లు అమానుషంగా కొడతాడు. ఆ దెబ్బలకు మల్లడి తల పగిలి రక్తం ఓడుతుంది, అతడు అక్కడికక్కడే స్పృహతప్పి పడిపోతాడు. ఆ గాయాల కారణంగా మల్లడు ఐదారు నెలల పాటు మంచాన పడతాడు. ఇంటి పెద్ద మనిషి మంచం పట్టడంతో అతడి భార్యాబిల్లలు తిండి లేక అలమటిస్తారు. కానీ, పటేల్ కనీసం కనికరం చూపకపోగా, మల్లడు వెట్టికి రాలేదనే నెపంతో అతడికున్న కొద్దిపాటి మాన్యాన్ని (భూమిని) కూడా జప్తు చేస్తానని బెదిరిస్తాడు. కేవలం అగ్రకులంలో పుట్టి, అధికారం చేతిలో ఉన్నందున పటేల్ ఒక నిరుపేద జీవితాన్ని ఎలా ఛిన్నాభిన్నం చేశాడో ఈ కథ వివరిస్తుంది.

**తెలంగాణలో 'వెట్టి' బానిసత్వం:**

తెలంగాణ సామాజిక చరిత్రలో 'వెట్టి' అనేది కేవలం శ్రమ దోపిడీ మాత్రమే కాదు, అది నిజాం కాలపు భూస్వామ్య వ్యవస్థలో చట్టబద్ధత పొందిన ఒక అమానవీయ ఆచారం. దీనికి ప్రధాన చారిత్రక వర్గాల శ్రమపై అగ్రకులాలకు ఉన్న సంపూర్ణ అధికారాన్ని, వారిని మనుషులుగా కూడా గుర్తించని స్థితిని ఈ కథ వాస్తవికంగా చిత్రించింది. దెబ్బలు తింది చాలక, మల్లడు ఐదారు నెలలు మంచాన పడితే అతడి కుటుంబాన్ని ఆదుకోవాల్సింది పోయి, తిరిగి అతడికున్న కొద్దిపాటి భూమిని (మాన్యాన్ని) జప్తు చేస్తానని పటేల్ బెదిరించడం నాటి ఆర్థిక దోపిడీకి పరాకాష్ట. పేదవాడిని అప్పుల ఊబిలోకి నెట్టి, అతడి భూమిని లాక్కుని, అతడిని తరతరాల పాటు బానిసగా (భగెల) మార్చుకునే కుట్రలను రచయిత ఈ కథ ద్వారా బహిర్గతం చేశారు.

"రెడ్డిగారు అంటే గ్రామ ప్రజలకు భయం" అన్న వాక్యం నాటి సమాజంలో నెలకొన్న అభద్రతా భావానికి సంకేతం. మల్లడిని అన్యాయంగా కొట్టినప్పుడు కూడా గ్రామంలో ఎవరూ ఎదురుతిరగక పోవడం, బాధితుడి పక్షాన నిలబడలేకపోవడం నాటి ప్రజల సామాజిక నిస్సహాయతను తెలియజేస్తుంది. కథలో వాడిన భాష కూడా నాటి సామాజిక వాస్తవికతను ప్రతిబింబిస్తుంది. పటేల్ వాడిన తిట్లు, అధికారిక పదజాలం ఒకవైపు... మల్లడి వంటి పీడిత వర్గాల ఆవేదన కలిగిన మాటలు మరోవైపు నాటి తెలంగాణ గ్రామీణ జీవన సంస్కృతికి అద్దం పడతాయి.

**వెట్టి మాదిగ కథ-పాత్రపోషణ:**

భాగ్యరెడ్డి వర్మ రాసిన 'వెట్టి మాదిగ' కథలో పాత్రల చిత్రణ నాటి తెలంగాణ సమాజంలోని వర్గ వైరుధ్యాలను, మానసిక స్థితిగతులను అత్యంత సహజంగా ప్రతిబింబిస్తుంది. ఈ కథలోని ప్రధాన పాత్రయైన మల్లడు అణగారిన వర్గాల నిస్సహాయతకు, శ్రమ దోపిడీకి నిలువెత్తు

మాడపాటి హనుమంతరావు గారి 'హృదయశల్యము' వంటి కథలు రాచరికపు నేపథ్యంతో, ఉన్నత వర్గాల మనోవైజ్ఞానిక విశ్లేషణకు ప్రాధాన్యమివ్వగా, 'వెట్టి మాదిగ' మాత్రం ఎటువంటి కాల్పనిక ఛాయలు లేకుండా పచ్చిని గ్రామీణ వాస్తవికతను, అట్టడుగు వర్గాల అస్తిత్వ వేదనను సాహిత్య కేంద్రబిందువుగా మార్చింది. అలాగే, తర్వాతి కాలంలో వచ్చిన ఆవుల పిచ్చయ్య 'వెట్టి చాకలి దినచర్య', వట్టికోట ఆళ్వారుస్వామి 'పరిగె', ఎస్.బి. సీతారామరావు 'గరీబోన్ని' వంటి కథలకు 'వెట్టి మాదిగ' కథే ప్రధాన ప్రేరణగా నిలిచింది. ఇతర తొలితరం కథలు సామాజిక రుగ్మతలను కేవలం బాహ్యంగానో లేదా హాస్య, సంప్రదాయ ధోరణుల్లోనో చిత్రించిన చోట... భాగ్యరెడ్డి వర్మ గడీల పాలనలోని కుల వివక్షను, ఆర్థిక శ్రమ దోపిడీని అత్యంత సూటిగా ఎండగట్టారు. ఈ విధంగా, శిల్పరీత్యా సమకాలీన కథలతో పోలికలు కలిగి ఉన్నప్పటికీ, వస్తుగతంగా దళిత జీవితాన్ని, వెట్టిచాకిరి క్రూరత్వాన్ని తెలుగు సాహిత్యంలో మొదటిసారి ఆవిష్కరించి, తర్వాతి తరం అభ్యుదయ, సాయుధ పోరాట కథలకు మార్గదర్శిగా నిలవడంలోనే 'వెట్టి మాదిగ' విశిష్టత దాగి ఉంది.

ఉపేందర్ ఆరెంపుల
రీసెర్చ్ స్కాలర్,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్
ఫోన్: 96661 60892



## పదాలు నడుపుతున్న కాలం...

ఎంత విధుల్చుకున్నా
కాలాన్ని ముందుకు నడిపిస్తున్న క్షణాల్లా
అవే పదాలు
మళ్లీ మళ్లీ మనసు అరల్లోకి చేరి
నా కొక కొత్త రూపాన్ని
ఇవ్వమని చినపిల్లల్లా మారం చేస్తాయి...

విరిగిపోయిన పడవలాంటి నా పైన
అలలతో గాయం చేసి
పద సంపదతో వాక్యాలల్లి
పరిమళం నింపుకొని భావాలై విరభూస్తూ
తుమ్మెదలకు ఆహ్వానం పలుకుతూ
పచ్చని తివాచీని పరుస్తాయి నేటి ఉదయానికి...

తెలిసి తెలియక ఒలుపుకున్న
పదాలన్నీ కూడ బలుక్కొని
పర్వత శ్రేణుల్లా నా బతుకు పొడవునా
రక్షణ కవచంలా నిలబడతాయి...

ఈసడింపుల, అసమానతల అనైక్యతకు
మానవ పరిణామక్రమమే
చరిత్రను సాక్ష్యంగా నిలబెడతాయి
పద్యాలన్నీ బతుకు తెరువుకు వేసిన అడుగులని
కాలంతో పాటు మౌనంగా నడుస్తూ
కొత్త రోజులుగా పుస్తూనే ఉంటాయి
ఈ పద్యానికి పదాలై...

బాబురావు చల్లగాలి, చెన్నై
9941469728